RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 287 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్

శనివారం 22 జూన్ 2024

# కౌరవ సభ నుండి గౌరవ సభకు..

## నెరవేరిన చంద్రబాబు శపథం..!!



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 21:**

శపథంఅంటే చంద్రబాబు చేసినట్టుండాలి.. శపథం అంటే చంద్రబాబు నెరవేర్చినట్టుండాలి.. ఇంతకాలం మనకు 'చాణక్య శపథం' అనే పదం మాత్రమే తెలుసు.. తెలుగు ప్రజలకు మరో కొత్త పదం పరిచయమైంది..అది రాజకీయ చాణక్యుడు చంద్రబాబు చేసిన శపథం ద్వారా క్రియేట్ అయింది. అదే 'చంద్రబాబు శపథం'. "ఇన్నేళ్ళూ పరువు కోసం బతికాను. అలాంటిది ఈరోజు సభలో నా భార్య ప్రస్తావన తెచ్చి, అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఇది గౌరవ సభ కాదు.. కౌరవ సభ. ఇలాంటి సభలో నేనుండలేను. మళ్ళీ ముఖ్యమంత్రిగానే ఈ సభలో అడుగుపెడతాను.
లేకపోతే నాకు రాజకీయాలే వద్దు. మీ అందరికీ ఓ నమస్కారం" అని నవంబర్ 19, 2021న శాసనసభలో చంద్రబాబు తీవ్ర అవమాన భారంతో శపథం చేశారు. ఆరోజు



నుంచి ఆయన అసెంబ్లీకి వెళ్ళలేదు. ప్రజల నుంచే తీర్పు కోరారు.ప్రజలు సరైన తీర్పు ఇచ్చారు. 'చంద్రబాబు శపథం' నెరవేరేలా చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగానే శుక్రవారం శాసనసభలోకి అడుగుపెట్టారు. గౌరవ సభలోకి చాలా గౌరవంగా ముఖ్యమంత్రి హోదాతో అడుగుపెట్టారు. 'చంద్రబాబు శపథం' అనే కొత్త పదాన్ని సృష్టించారు. శపథం నెరవేర్చుకున్న చంద్రబాబు..!!
చంద్రబాబు ఎక్కడైతే అవమానపడ్డారో.. అక్కడే సగర్వంగా తలెత్తుకు నిలబడ్డారు.. దటీజ్ చంద్రబాబు!' – ఇది రాజధాని రైతుల నోట వినిపిస్తున్న మాట! రాజధాని గ్రామాల్లో ప్రతిధ్వనిస్తున్న మాట! తెలుగుదేశం–జనసేన– బీజేపీ కూటమి కనీవినీ ఎరుగని రీతిలో అనూహ్య విజయం పొందడం పట్ల రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాటి చంద్రబాబు శపథమే రాజధాని నిర్మాణానికి శ్రీరామ రక్ష అయిందని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో తమ తలరాతలు మారబోతు న్నాయని వారు సంబరాలు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి అన్న కనీస గౌరవం లేకుండా చంద్రబాబును తీవ్ర అవమానంపాలు చేశారు. అసెంబ్లీ సాక్షిగా నిరాదార నిందారోపణలు చేస్తూ, ఆయన సతీమణిని అవమానించ డంతో ఆయన అసెంబ్లీ నుంచి శోకాతప్తుడై బయటకి వచ్చారు. గుండెలు పగిలే ఆవేదనను అదుపు చేసుకోలేక కన్నీరు కార్చారు. బయటకు వచ్చే ముందు కౌరవ సభగా మారిన అసెంబ్లీని గౌరవ సభగా మార్చి ముఖ్యమంత్రిగా అడుగుపెడతానని శపథంచేశారు. ఆరోజున చంద్ర బాబు కంట కారిన కన్నీరు, ఆయన చేసిన శపథం ప్రజల గుండెలను కదిలించి వేశాయి. ప్రజలంతా ఆయన వెంటే నిలిచారు. ఆయన శపథం నెరవేరేలా చరిత్ర ఎరుగని తీర్పునిచ్చారు. అధికార వైసీపీకి డిపాజిట్లు లేకుండాచేసి తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకు న్నారు. ఇలాంటి విజయం ఒక్క చంద్రబాబుకే సాధ్యమని, పడిన చోటే లేచి తలెత్తుకు నిలిచే తత్వం వల్లే ఆయన ఇవ్వాళ ఇంతటి ఘన విజయాన్ని సాధించారని ప్రజలు చెబుతున్నారు. అవమానాల్ని అధిగ మించి ఆత్మస్థైర్యంతో తాను నిలబడడమే కాకుండా, తాను తలపెట్టిన రాజధానిని, తనను నమ్మిన రైతాంగాన్ని కాపాడారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ గెలుపు చంద్రబాబు గెలుపు మాత్రమే కాదని అది రాజధాని రైతుల, రాష్ట్ర ప్రజల గెలుపని అంటున్నారు. రాజధాని రైతులను వేధించడం, మాజీ ముఖ్యమంత్రి అన్న గౌరవం కూడా లేకుండా చంద్రబాబును అవమానించడం జగన్‌రెడ్డి చేసిన దిద్దుకోలేని తప్పు. చంద్రబాబును అవమానించడం, ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరిని అల్లరిపాలు చేయాలనుకోవ డమే వైసీపీకి శాపంగా మారింది. ప్రజలు తగిన బుద్ధి చెప్పారు.

# ఏపీ అసెంబ్లీ స్పీకర్ గా అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవం.!



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 21:**
ఏపీలో అధికార కూటమి స్పీకర్ గా నిలబెట్టిన టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ గా అయ్యన్నపాత్రుడు తరపున ఇవాళ కూటమి నేతలు అసెంబ్లీ కార్యదర్శికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.గడువు ముగిసేలోగా ఇతర నామినేషన్లేవీ రాకపోవడంతో అయ్యన్నపాత్రుడు స్పీకర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అధికారులు ప్రకటించారు. ఇవాళ ఉదయం అయ్యన్నపాత్రుడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు.ఏపీ అసెంబ్లీ స్పీకర్ గా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రుడు నేపథ్యాన్ని ఓసారి పరిశీలిస్తే.. ఎన్టీఆర్ 1983లో పార్టీ స్థాపించి తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన బీసీ నేత. 1983 నుంచి ఇప్పటివరకూ ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఆయన నర్సీపట్నం నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఎన్టీఆర్, చంద్రబాబు కేబినెట్లలో పలుమార్లు మంత్రిగా వ్యవహరించిన అనుభవం ఉంది. నర్సీపట్నం నుంచి మరోసారి గెలిచిన ఆయన్ను కేబినెట్లోకి తీసుకునే అవకాశం లేకపోవడంతో చంద్రబాబు స్పీకర్ గా అవకాశం కల్పించారు.
ఇవే తనకు చివరి ఎన్నికలుగా ప్రకటించిన అయ్యన్నపాత్రుడు తనతో పాటు కుమారుడు చింతకాయల విజయ్ ని కూడా ఎంపీగా అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే చంద్రబాబు మాత్రం అయ్యన్నకు మాత్రమే ఎమ్మెల్యే సీటు ఇచ్చారు. దీంతో అయిష్టంగానే ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన అయ్యన్న మరోసారి చంద్రబాబు కేబినెట్లో మంత్రి పదవి ఆశించారు. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మంత్రి పదవి ఇవ్వలేకపోయిన చంద్రబాబు.. స్పీకర్ గా మాత్రం అవకాశం ఇచ్చారు. దీంతో అయ్యన్న సంతోషంగానే కనిపిస్తున్నారు. స్పీకర్ గా ఎన్నిక కావడం సంతోషం గా ఉందని అయ్యన్నపాత్రుడు తెలిపారు. గతంలో ఎమ్మెల్యే గా, మంత్రిగా, ఎంపీ గా పని చేసానని, స్పీకర్ గా కుర్చీలో కూర్చున్న తర్వాత పార్టీ గుర్తు రాకూడదని అయ్యన్న పేర్కొన్నారు. గౌరవ విపక్ష సభ్యులకు కూడా అసెంబ్లీలో ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. వారికి కూడా అధికార పక్షంగా పాటు మాట్లాడేందుకు సమయం ఇస్తానని, నా పనితీరు మీరే చూస్తారన్నారు.

# బీజేపీలో చేరికకు వైఎస్సార్‌సీపీ నేతలు సిద్ధం.!

**-జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు.**



ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 21:
అసెంబ్లీ లాబీల్లో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో చేరేందుకు వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి బీజేపీ అగ్ర నాయకత్వంతో టచ్‌లోకి వెళ్లారని వారితో మాట్లాడుతున్నారని తెలిపారు. వైసీపీ ఖాళీ కావడం ఖాయంగా కన్పిస్తోందని పేర్కొన్నారు. బీజేపీ ఒప్పుకుంటే అవినాష్ రెడ్డి మినహా వైసీపీ ఎంపీలంతా పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కానీ బీజేపీ నాయకత్వం వాళ్లు అక్కర్లేదని అంటోందని తెలిపారు. కానీ తాము చేరతామంటూ మిథున్ ఇంకా లాబీయింగ్ చేస్తున్నారన్నారు.బీజేపీలో చేరాల్సిందిగా తండ్రి పెద్దిరెడ్డి మీద కూడా మిథున్ ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఓదార్పు యాత్ర కోసం జగన్ మళ్లీ 14 కారణాలు వెతుక్కుంటున్నారని విమర్శించారు. ఏ దారి దొరక్కపోతే బాధితులను సృష్టించుకుంటారన్నారు. చెల్లివల్లే నష్టపోయామని జగన్ తెలుసుకున్నాడని, ఆమెతో రాజీ చేయాలని తల్లిని కోరాడన్నారు. అన్ననే వచ్చి కాంగ్రెస్?లో చేరాలని షర్మిల చెప్పేసిందని అన్నారు. త్వరలోనే వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డి అరెస్టు అవుతారన్నారు.

## మాజీ మంత్రి కొడాలి నానిపై వలంటీర్ల ఫిర్యాదు తో.. కేసు నమోదు.!



2లో

# బిజెపిలోకి.. పెద్దిరెడ్డి కుటుంబం..?



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 21:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపిపార్టీ ఖాళీ అయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయిన జగన్మోహన్ రెడ్డి పార్టీని వీడేందుకు...కీలక నేతలు ఎదురుచూస్తున్నారట. ఐదు సంవత్సరాల పాటు అధికారం లేకపోతే చాలా కష్టమని చాలా మంది నేతలు భావిస్తున్నారట. మొన్నటి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి పార్టీకి కేవలం 11 అసెంబ్లీ స్థానాలు దక్కిన సంగతి అందరికీ తెలిసిందే. దీంతో ఏపీలో ప్రతిపక్ష హోదా కూడా వైసిపికి.. దక్కే పరిస్థితి లేదు. ఇక అటు తెలుగుదేశం కూటమికి ఏకంగా 164 స్థానాలు దక్కడంతో... ఆ పార్టీలో ఉన్న అగ్ర నేతలు రెచ్చిపోతున్నారు. వైసిపి నేతలను టార్గెట్ చేస్తూ దాడులు చేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో వైసిపిలో ఉన్న కొంతమంది లీడర్లు బిజెపిలోకి జంపు కావాలని చూస్తున్నారట. ఇదే విషయాన్ని... తాజాగా...బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ స్పష్టం చేశారు. ఇవాళ అసెంబ్లీ లాబీల్లో బీజేపీఎమ్మెల్యే ఆదినారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు.
బీజేపీలో చేరేందుకు మిధున్ రెడ్డిబీజేపీ అగ్ర నాయకత్వంతో టచ్ లోకి వెళ్లారని బాంబ్ పేల్చారు ఆదినారాయణ రెడ్డి. వైసీపీ ఖాళీ కావడం ఖాయంగా కన్పిస్తోందని... స్వయంగా మిథున్ రెడ్డి కూడా... బీజేపీ నాయకత్వంతో మాట్లాడుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ. బీజేపీ ఒప్పుకుంటే అవినాష్రెడ్డి మినహా వైసీపీ ఎంపీలంతా పార్టీ మారడానికి రెడీగా ఉన్నారని పేర్కొన్నారు.

# పులివెందుల ఎమ్మెల్యేగా.. జగన్ ప్రమాణస్వీకారం.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 21: ఏపీ అసెంబ్లీ 16వ సమావేశాలు ఈ రోజు ప్రారంభమైన సంగతి తెలిసిందే. తొలిరోజు సభలో ఎమ్మెల్యేల చేత ప్రోటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ క్రమంలోనే ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత, పులివెందుల ఎమ్మెల్యే జగన్ ప్రమాణ స్వీకారంపై సర్వత్రా ఆసక్తి ఏర్పడింది. అసలు జగన్ అసెంబ్లీకి వస్తారా రారా అన్న మీమాంసకు తెరదించుతూ ప్రమాణం చేసేందుకు జగన్ వచ్చారు. గత శాసనసభ సమావేశాల సందర్భంగా 151 మంది ఎమ్మెల్యేలతో బలవంతుడిగా, ధీమాగా కనిపించిన జగన్%ౌ%తాజాగా 11 మంది ఎమ్మెల్యేలతో అదే సభలో బలహీనుడిగా, దీన వదనంతో అడుగు పెట్టడం కనిపించింది. ప్రమాణ స్వీకారం సందర్భంగా కూడా సీఎం జగన్ డీలాగా కనిపించారు. ఏపీ శాసనసభలో ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడంతో జగన్ కేవలం పులివెందుల ఎమ్మెల్యేగా మాత్రమే ప్రమాణ స్వీకారం చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ఎంతో ధీమాగా కనిపించిన జగన్ కలలో కూడా ఊహించని విధంగా 11 సీట్లకే పరిమితమై దీనంగా ప్రమాణ స్వీకారం చేసిన వైనం చర్చనీయాంశమైంది. సభలో దాదాపు 80 శాతం



సభ్యులు పసుపు కండువాలతో కనిపించడంతో సభ మొత్తం పసుపుమయమైంది. వాస్తవానికి ప్రమాణస్వీకారం అసెంబ్లీలో ప్రమాణం చేస్తున్న సందర్భంగా సభ్యులు తమ తమ పార్టీల కండువాలను వేసుకొని వస్తుంటారు. కానీ, జగన్ మాత్రం కండువా లేకుండానే వచ్చి ప్రమాణస్వీకారం చేశారు. 21 మంది జనసేన ఎమ్మెల్యేలు, తమ పార్టీ కండువాలతో కనిపించారు. ఇటువంటి సభలో తాను కాకుండా పది మంది ఎమ్మెల్యేలతో అడుగుపెట్టిన జగన్ చాలా అసౌకర్యంగా కనిపించారు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మిగతా సభ్యులకు నమస్కారం చేస్తూ జగన్ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. మొత్తంగా సభలో జగన్ 5 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఉండలేదు. ప్రోటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరికి నమస్కారం చేసిన జగన్ సభ నుంచి తన ఛాంబర్ కు వెళ్లారు.

వాస్తవానికి జగన్ అసెంబ్లీకి కూడా ఎప్పుడూ వచ్చే దారిలో కాకుండా వెనుకవైపు నుంచి వచ్చారు. మెయిన్ గేటులో అమరావతి రైతులు, ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతుందేమోనన్న భయంతో జగన్ ఇలా చేశారని తెలుస్తోంది. సరిగ్గా తన ప్రమాణం వంతు వచ్చే సమయానికి 5 నిమిషాల ముందు సభలోకి వచ్చిన జగన్ ప్రమాణ స్వీకారం చేసి 2 నిమిషాల్లో వెళ్లిపోయారు. మంత్రులు ప్రమాణం చేసిన తర్వాత జగన్ ప్రమాణం చేసేలా అనుమతివ్వాలని చంద్రబాబును వైసీపీ నేతలు రిక్వెస్ట్ చేయడంతో చంద్రబాబు అనుమతించారు. లెక్క ప్రకారం అయితే, ప్రతిపక్ష హోదా దక్కని నేపథ్యంలో ఎమ్మెల్యేగా జగన్ తన వంతు వచ్చినప్పుడు ప్రమాణం చేయాలి.

మరి రాబోయే రోజుల్లో జగన్ సభలో ఉంటారా లేదంటే తన పార్టీ నేతలతో చెప్పిన విధంగా అసెంబ్లీని బాయ్ కాట్ చేసి ప్రజల మధ్యకు వెళతారా అన్నది తేలాల్సి ఉంది. అయితే, ప్రతిపక్ష హోదా కూడా లేని సభలో జగన్ ఉండే అవకాశాలు తక్కువని, పెద్దిరెడ్డికి సభా వ్యవహారాలు అప్పగించి జగన్ అసెంబ్లీకి రాకుండా ఉండే అవకాశాలు ఎక్కువని తెలుస్తోంది.

# మాజీ మంత్రి కొడాలి నానిపై వలంటీర్ల ఫిర్యాదు తో..కేసు నమోదు.!



ఆంధ్ర ప్రగతి గుడివాడ జూన్ 21:
కొడాలి నాని తమతో బలవంతంగా రాజీనామా చేయించారంటూ పోలీసులకు మాజీ వలంటీర్ల ఫిర్యాదువారి ఫిర్యాదుతో వైసీపీ నేతపై కేసు నమోదు చేసిన గుడివాడ పోలీసులు. నానితో పాటు దుక్కిపాటి శశిభూషణ్, గొర్ల శ్రీను, మరో ఇద్దరు వైసీపీ నేతలపై కేసు నమోదు చేశారు.

ఎన్నికలకు ముందు పలువురు వార్డు వలంటీర్లతో వైసీపీ నేతలు రాజీనామాలు చేయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నానికి గట్టి షాక్ తగిలింది. మాజీ వార్డు వలంటీర్లు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమను వేధించి కొడాలి నాని తమతో బలవంతంగా రాజీనామా చేయించారంటూ వలంటీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కొడాలి నానిపై గుడివాడ పోలీసులు కేసు నమోదు చేశారు. కొడాలి నానితో పాటు ఆయన సన్నిహితుడు దుక్కిపాటి శశిభూషణ్, గుడివాడ పట్టణ వైసీపీ అధ్యక్షుడు గొర్ల శ్రీను మరో ఇద్దరు వైసీపీ నేతలపై 447, 506 ఐపీసీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

# నంద్యాల ఆటోనగర్ పేరు మార్పు.!






ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21: వైసీపీ ప్రభుత్వం లో అక్రమంగా మార్చిన ఆటోనగర్ పేరును తిరిగి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆటోనగర్,నంద్యాల గా ఎన్ ఎండి ఫిరోజ్ చేతుల మీదుగా మార్చడం జరిగింది. 20 ఏళ్ళ క్రితం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్ఎండి ఫరూక్ నాయకత్వంలో ఆటోనగర్ స్థలాన్ని కేటాయించి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆటోనగర్ సొసైటీ పేరుతో ఏర్పాటు చేసి అభివృద్ధి చేయడం జరిగింది. నారా చంద్రబాబు నాయుడు ఆటో నగర్ అని ప్రతి మెకానిక్ షెడ్ పట్టాలో ఉంటుంది. కానీ వైసీపీ ప్రభుత్వం ఆ పేరు ఉండకూడదని గత ఐదేళ్లుగా తమ పార్టీ పేర్లను ఏర్పాటు చేసుకొని ఆ ప్రాంతాన్ని కక్షతో ఎటువంటి అభివృద్ధి చెయ్యలేదు. కనీస సౌకర్యలైన మంచి నీటి సదుపాయం, రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, సెక్యూరిటీ,కంప చెట్ల తొలగింపు ఇవేమి చెయ్యకుండా పేర్లను అక్రమంగా మారుస్తూ నీచ రాజకీయాలు చేశారు. వర్షం కురిస్తే మోకాళ్ళ లోతు మురికి నీరు ప్రవేహిస్తుంది, విష సర్పాలు పట్టపగలు తిరుగుతున్నా పట్టించుకోలేదు.
కావున ఆటోనగర్ కమిటీ నాయకులు %ం% సభ్యులు సంతోషంగా ఫిరోజ్ చేతుల మీదుగా ఆటోనగర్ పాత పేరైనా నారా చంద్రబాబు నాయుడు పేరుతో బోర్డుని ఏర్పాటు చేయడం జరిగింది.

# డీజీపీగా ద్వారకా తిరుమలరావు బాధ్యతల స్వీకరణ.

### -మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు



ఆంధ్ర ప్రగతి మంగళగిరి జూన్ 21: ఏపీ నూతన డీజీపీగా సీహెచ్ ద్వారకా తిరుమలరావు బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన హరీశ్??కుమార్ గుప్తా నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఐపీఎస్ అధికారులకు ద్వారకా తిరుమలరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పోలీసుల గౌరవవందనం స్వీకరించి, ఉదయం 7:50 గంటలకు డీజీపీగా సంతకం చేశారు. 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారైన ద్వారకా తిరుమలరావు ప్రస్తుతం రాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారుల సీనియారిటీ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. మొట్టమొదటిగా కర్నూలు ఏఎస్పీగా పోస్టింగ్ చేపట్టారు. ఆ తర్వాత ఆయన కామారెడ్డి, ధర్మవరంలో ఏఎస్పీగా పనిచేశారు. నిజామాబాద్ జిల్లా ఆపరేషన్స్ విభాగం అదనపు ఎస్పీగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఎస్పీగా పదోన్నతి పొందాక, అనంతపురం, కడప, మెదక్ జిల్లాలతో పాటు విజయవాడ రైల్వే, సీఐడీ, సీబీఐ విభాగాల్లో విధులు నిర్వహించారు. అనంతపురం, హైదరాబాద్ రేంజ్‌లతో పాటు ఎస్ఐబీలో డీఐజీగా ద్వారకా తిరుమలరావు విధులు నిర్వహించారు. ఆక్టోపస్, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ విభాగాల్లో ఐజీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా, రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ నగర పోలీసు కమిషనర్‌గా పనిచేశారు. 2021 జూన్ నుంచి ఆర్టీసీ ఎండీగా ఉన్నారు. తిరుమలరావుకు నిక్కచ్చిగా వ్యవహరించే సమర్థ అధికారిగా పోలీసు శాఖలో గుర్తింపు ఉంది. తాజాగా ఆయన ఇవాళ బాధ్యతలు చేపట్టారు.

# అసెంబ్లీ గేటు దాటొచ్చా..
# ఇప్పుడెంత్రా అబ్బాయిలు..!



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 21:**

ఏట్టకేలకు జనసేనాని పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన పార్టీ శ్రేణుల కల నెరవేరింది. పవన్ కళ్యాణ్ ను అసెంబ్లీ గేటు కూడా తాకనీయబోమనే వైసీపీ నేతల అవహేళనలు, సెటైర్లు, అహంకారపూరిత మాటలకు ఆయన ఈ ఎన్నికల్లో గట్టి సమాధానం చెప్పిన సంగతి తెలిసిందే. టీడీపీతో పొత్తును ప్రకటించడమే కాకుండా బీజేపీని కూడా పొత్తులోకి తెచ్చి గేమ్ చేంజర్ గా నిలిచారు. కూటమి అఖండ విజయంలో కీలక పాత్ర పోషించారు. పిఠాపురం నుంచి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. అంతేకాకుండా ఈ ఎన్నికల్లో తన పార్టీ పోటీ చేసిన చోట్ల 21కి 21 అసెంబ్లీ స్థానాలను, 2కి రెండు ఎంపీ స్థానాలను గెలిపించుకుని రికార్డు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా, అడవులు, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితమే డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన పవన్ ఉన్నతాధికారులతో వరుస సమీక్షలతో జోష్ పెంచారు. తాజాగా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పవన్ కళ్యాణ్ అసెంబ్లీకి చేరుకున్నారు. ఆయనకు పలువురు టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. అందరికంటే ముందుగానే అసెంబ్లీకి వచ్చిన ఆయన జనసేన పార్టీకి కేటాయించిన చాంబర్ లో సీఎం చంద్రబాబు కోసం ఎదురు చూశారు. చంద్రబాబు రాగానే ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబు, పవన్ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. తొలుత సీఎం చంద్రబాబుతో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు లేచి చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఆనందంతో బల్లలు మోగించారు. 'కొణిదెల పవన్ కళ్యాణ్ అనే నేను'.. అంటూ ఆయన తెలుగులో ప్రమాణపత్రాన్ని చదివారు. దైవసాక్షిగా శాసనసభ నియమాలను పాటిస్తానని, శాసనసభ సంప్రదాయాలకు అనుగుణంగా నడుచుకుంటానని, సార్వభౌమాధికారాన్ని కాపాడతానని, తన బాధ్యతలను శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని ప్రమాణం చేశారు. ప్రమాణం పూర్తయ్యాక ప్రొటెం స్పీకర్



వద్దకు వెళ్లి ఆయనకు నమస్కరించి.. కిందకు దిగి వచ్చి రిజిస్టర్ లో సంతకం చేశారు.
కాగా పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయడంతో జనసేన శ్రేణులు, అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. 'కొణిదెల పవన్ కళ్యాణ్ అనే నేను' అంటూ పవన్ చేసిన ప్రమాణస్వీకారం వీడియోను వైరల్ చేస్తున్నారు. వైసీపీ నేతలు తమ జనసేనానిని అసెంబ్లీకి అడుగుపెడ్డనీయబోమన్నారని.. కానీ ఆయన సింహంలాగా గేట్లు బద్దలుకొట్టుకుని అసెంబ్లీలోకి ఎంట్రీ ఇచ్చారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పవన్ సోదరుడు, జనసేన ముఖ్య నేత నాగబాబు సైతం సింహం అసెంబ్లీ గేట్లను తోసుకుని అరుచుకుంటూ వస్తున్న వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వనీయమన్నారంటూ దానికి క్యాప్షన్ పెట్టారు. పరోక్షంగా పవన్ కళ్యాణ్ సింహంలాగా అసెంబ్లీ గేట్లను తోసుకుని ఎంట్రీ ఇచ్చారని పోస్టు చేశారు.

# సుచరిత కుటుంబాన్ని
## పరామర్శించిన హోంమంత్రి అనిత.

**-ఈపూరుపాలెంలో ఘటనా స్థలాన్ని పరిశీలించిన హోం మంత్రి వంగలపూడి అనిత.**

**-సుచరిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పిన హోం మంత్రి.**





ఆంధ్ర ప్రగతి చీరాల జూన్ 21:
బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంలో యువతి సుచరిత అత్యాచారం, హత్య జరిగిన ఘటనా స్థలాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. సుచరిత కుటుంబ సభ్యులను హోం మంత్రి అనిత పరామర్శించి ధైర్యం చెప్పారు. పోలీసులను అడిగి ఘటన జరిగిన తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఆదేశానుసారం బాధిత కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ఆమె ప్రకటించారు. యువతి హత్యోదంతం దారుణమని.. 48 గంటల్లో కేసును ఛేధించి నిందితులను అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం బాధిత కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషయా ప్రకటించామన్నారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తారన్నారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా గంజాయి వల్లనే రాష్ట్రంలో నేరాలు పెరిగాయని ఆమె ఆరోపించారు. విచ్చలవిడిగా నేటికి జరుగుతున్నాయన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని.. గంజాయి నిర్మూలన కోసం త్వరలోనే టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఏంతటి వారైనా ఉపేక్షించేది లేదని హోంమంత్రి స్పష్టం చేశారు.

# నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించి నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:
నీట్ పరీక్ష 2024 ఫలితాలు నీట్ పరీక్ష నిర్వహణపై విద్యార్థులు తల్లిదండ్రులు నుండి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున నీట్ పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వంశీ శివ ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు రఫీ డిమాండ్ చేస్తూ నంద్యాల ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర నిరసన కార్యక్రమం చేసి అనంతరం ఎమ్మార్వో కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ సహాయ కార్యదర్శి బొగ్గులేని సాయి, నడిగడ్డ మా భాష నాయకులు మహేష్, హరి, సిద్దు, రమేష్ బాబు, సుభాష్, ప్రసాద్, నాగేంద్ర, సుధాకర్, బన్నీ రియాజ్ లు పాల్గొన్నారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్టిఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నందున ఎన్టిఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నీట్ పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రం గల ఒకే సీరియల్ నెంబర్లతో కూడిన ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారు దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం కనుక నీట్ పరీక్ష నిర్వహణ ఎన్ టి ఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల ఫలితాలపై అనేక గందరగోళాలు అనుమానాలు అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నందున పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. నీట్ పరీక్షలు మరలా నిర్వహించాలని నీట్ లీకేజీ పై సుప్రీంకోర్టు జడ్జి న్యాయ విచారణ జరిపించాలని బాధితులను కఠినంగా శిక్షించాలని లీకేజీ పై నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎన్ టి ఏ ను రద్దు చేయాలని నీట్ నిర్వహణ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామని డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. లేని ఎడల దేశ ఆప్తంగా నేటి విద్యార్థులను కలుపుకొని ఆందోళన చేపటానికి సిద్ధమవుతామని వారు తెలిపారు.

# యోగాతో శారీరక, మానసిక ఒత్తిడులకు దూరం కండి

## -జిల్లా కలెక్టర్ డా. కె శ్రీనివాసులు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 21:
ప్రతిరోజు యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడుల నుంచి బయటపడి సమతుల్యమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ డా. కె శ్రీనివాసులు వెల్లడించారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా నంద్యాల ఆయుష్ విభాగం వారు పద్మావతి నగర్ లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన యోగ శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతిరోజు క్రమం తప్పకుండ యోగ చేయడం వలన శారీరక, మానసిక



సామర్థ్యం పెరగడంతో పాటు మనసు, శరీరము సమతుల్యమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకుని ఆనందంగా జీవించాలన్నారు. మనస్సు, శరీరముల మధ్య సంయమనం కలుగ చేయడమే యోగ ముఖ్య లక్ష్యమన్నారు. అలాగే శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధుల నుండి బయటపడటానికి ఆస్కారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఆధునిక జీవన శైలిలో భాగంగా ప్రతి ఒక్కరు కూర్చొని చేసే పనులు అధికంగా ఉండటం వల్ల నడుము నొప్పి, మెడ నొప్పి, దీర్ఘకాలిక వ్యాధులు ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. నిరంతరం యోగ చేయడం వలన అనేక వ్యాధుల నుండి ఉపశమనం పొందవచ్చున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ, ప్రతి కుటుంబము యోగ చేయడం అలవాటు చేసుకుని శారీరక, మానసిక ఒత్తిడుల నుంచి దూరం కావాలని ఆయన ఆకాంక్షించారు.
ఈ యోగా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ప్రభుత్వ ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ యశోదర, డిసిహెచ్ఎస్ డా. జఫ్రుల్లా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి రాజు ఆయుష్ శాఖ సిబ్బంది, సూక్లియస్ కాలేజీ విద్యార్థులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎన్ఎండీ ఫరూఖ్.!

ఆంధ్ర ప్రగతి అమరావతి, జూన్ 21:
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులుగా జనాబ్ నస్యం మహమ్మద్ ఫరూఖ్ శుక్రవారం పదవీ బాధ్యతలను చేపట్టారు. రాష్ట్ర సచివాలయం 3వ బ్లాక్ లో తనకు కేటాయించిన ఛాంబర్ (రూమ్ నెంబర్ 212)లో మధ్యాహ్నం 2 గంటలకు సర్వమత ప్రార్థనలు, ప్రత్యేకంగా నమాజ్ అనంతరం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి తొలిసారిగా సంతకం చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి జన్ వికాస్ కేంద్రం (పీఎంజేవీకే) వంటి కేంద్ర పథకాల ద్వారా మైనారిటీల కోసం నైపుణ్యాభివృద్ధి విద్య, ఆరోగ్యం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అంశంపై ఉన్నతాధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. పీఎంజేవీకే క్రింద 2014-19లో మంజూరైన రూ.643.54 కోట్ల విలువైన 77 ప్రాజెక్టులను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో గత ఐదేళ్లలో ప్రాజెక్టుల విషయంలో ఎలాంటి పురోగతి లేని కారణంగా జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు ఇచ్చి త్వరగా వాటిని పూర్తి చేయాల్సిందిగా మైనార్టీల సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ.కె. హర్షవర్ధన్ కు సూచించినట్లు తెలిపారు. రాష్ట్రం తరపున కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. రెవెన్యూ లో ఉన్న వక్ఫ్ బోర్డును, పాఠశాల విద్యాశాఖలో ఉన్న ఉర్దూ అకాడమీని, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి వాటిని ఏకం చేసి మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ గా నామకరణం చేసిన ప్రక్రియలో తన పాత్రను మంత్రి ఫరూఖ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో మైనారిటీలోని ముస్లింలు, క్రిస్టియన్ ల అభివృద్ధికి కృషి చేశామన్నారు. ప్రస్తుతం దర్గాలు, వక్ఫ్ బోర్డుల్లో పలు సమస్యలు ఉన్నాయని తమ దృష్టికి వచ్చాయని వాటన్నింటిపై కూలంకషంగా చర్చించి పరిష్కరిస్తామన్నారు. వక్ఫ్ బోర్డుకు కోట్లాది ఆస్తులు ఉన్నాయని వాటిని కాపాడుతామన్నారు. గతంలో ముస్లిం యువత కోసం కర్నూలు, కడపలో కమర్షియల్ కాంప్లెక్స్ లు కట్టించి తద్వారా ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ప్రస్తుతం ముస్లిం, మైనారిటీలకు ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకుంటామన్నారు. చర్చల అభివృద్ధి కోసం



ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు చేసిన కృషిని వివరించారు. హజ్ యాత్రికుల కోసం మంచి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మైనారిటీల ఆర్థిక జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. గత ప్రభుత్వం ముస్లిం, మైనారిటీ కోసం చేసిందేమీ లేదన్నారు. పెళ్లికానుకతో సహా పలు పథకాలు, సంక్షేమం పేరుతో మభ్య పెట్టిందన్నారు. విదేశీ విద్య కు "డా. ఏపీజే అబ్దుల్ కలాం విదేశీ విద్య"గా నామకరణం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రపతిగా ఈ దేశానికి సేవ చేసిన ఆయన పేరును ఈ పథకానికి పెట్టడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే సంబంధిత ఫైల్ ను ముఖ్యమంత్రి అనుమతి కోసం పంపిస్తామన్నారు. గతంలో విదేశీ విద్యకు ఎన్టీఆర్, అంబేద్కర్ వంటి వారి పేర్లు ఉండేవని, గత ప్రభుత్వం ఆయా పేర్లను తొలగించిన విషయాన్ని మంత్రి ఫరూఖ్ గుర్తుచేశారు. మైనార్టీల సంక్షేమం, నాణ్యమైన విద్య అమలు కోసం వందలాది కోట్లు ఖర్చు చేసిన ఘనత తమదే అన్నారు. న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా తనకు అవకాశం కల్పించినందుకు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. నారా చంద్రబాబు నాయుడు కు ధన్యవాదాలు తెలిపారు. ఎమెల్యేగా, మండలి ఛైర్మన్ గా, డిప్యూటీ స్పీకర్ గా, గతంలో, ప్రస్తుతం మంత్రిగా తనకు పలుమార్లు మంచి అవకాశాలు కల్పించినందుకు దివంగత ఎన్టీ రామారావు, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, లోకేష్ కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. 2024లో కూటమి ఘన విజయంపై సంతృప్తి వ్యక్తం చేశారు. తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంత్రిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ స్పష్టం చేశారు. రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జనాబ్ నస్యం మహమ్మద్ ఫరూఖ్ కు న్యాయ, మైనారిటీ శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నసీర్, మైనారిటీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్, న్యాయశాఖ కార్యదర్శి ప్రభాకర్ రావు, వక్ఫ్ బోర్డు సీఈవో అబ్దుల్ ఖాదర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్ వలీ, ఎంహెచ్ పీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మౌలానా హుస్సేన్ అహ్మద్, న్యాయ, మైనారిటీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అహోబిలంలో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు

## -తిరుపతి - శ్రీశైలం ఆధ్యాత్మిక వైష్ణవ, శైవ క్షేత్రాల కారిడార్ ఏర్పాటు చేయాలి.

ఆంధ్ర ప్రగతి అహోబిలం జూన్ 21:
ఆళ్లగడ్డ నియోజకవర్గం నల్లమల అరణ్యంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో బైరెడ్డికి అధికారులు స్వాగతం పలికి



ఎగువ అహోబిలంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి మూలవిరాట్ కు, దిగువ అహోబిలంలో ఉత్సవ మూర్తులను బైరెడ్డి దర్శనం చేసుకున్నారు, ఆలయ పూజారులు బైరెడ్డిని శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదం అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి - శ్రీశైలం పుణ్యక్షేత్రాలను కలుపుతూ నల్లమల ప్రకృతి అందాలను ఆశ్వాధించేలా వైష్టవ, శైవ క్షేత్రాల దర్శనం కారిడార్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని కోరారు. నంద్యాల పార్లమెంట్ సభ్యురాలుగా తన కూతురు డా. బైరెడ్డి శబరి విజయం సాధించడంతో అహోబిలంలో స్వామి అమ్మ వార్లను దర్శనం చేసుకొని మొక్కలు తీర్చుకున్నామని, ఎంపి శబరితో ఈ పుణ్యక్షేత్రాల కారిధార్ కు కృషి చేస్తామన్నారు.

# అన్న క్యాంటిన్లను పరిశీలించిన

## నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:
తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదల ఆకలి కష్టాలను తీర్చేందుకు నాణ్యమైన భోజనం అందించే గొప్ప కార్యక్రమం అన్న క్యాంటిన్లని పునః ప్రారంభించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని నంద్యాల



టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా నంద్యాలలో ఉన్న అన్న క్యాంటీన్లను పరిశీలించిన ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. నంద్యాల ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ ఎన్ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు మొదటి దశలో నంద్యాల పట్టణంలోని 3 చోట్ల పునః ప్రారంభించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా క్యాంటిన్లను వద్ద పర్యటించి ప్రభుత్వ అధికారుల ద్వార ప్రస్తుత పరిస్థితి %ఁ% పెండింగ్ పనులు గురించి తెలుసుకున్నారు. రాబోయే క్యాబినెట్ సమావేశంలో అన్న క్యాంటిన్లను పునః ప్రారంభం పై ఆమోద ముద్ర రాగానే పనులు ప్రారంభమై అతి త్వరలో అన్న క్యాంటిన్లు నంద్యాల ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీనిచ్చారు.

# ఉపాధి పనులు కల్పించండి మహాప్రభో...

**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు జూన్ 21:**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద మధ్యతరగతి ప్రజల పాలిట పరంగా ఉపాధి కల్పిస్తూ ఆసరాగా ఉన్నది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీ నుండి ప్రతి కుటుంబానికి 100 కూలీలతో ఎన్ఆర్ఈజీఎస్ పనులు ఉండేవి. ఈ సంవత్సరం పనులు మంజూరు



కాకపోవడంతో ఉపాధి లేక ఉపాధి కూలీల జీవనోపాధి అస్తవ్యస్తంగా మారిపోయింది. పనులు కల్పిస్తారా లేదా అన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోతుంది. ఉపాధి పనుల కోసం గ్రామాల్లో ఉపాధి కూలీలు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. మాకు ఉపాధి పనులు కల్పించండి మహాప్రభువు అని ఉపాధి కూలీలు అధికారులను వేడుకుంటున్నారు. అధికారులు మాత్రం పనులు కల్పిస్తామని భరోసా ఇవ్వకపోవడంతో మా జీవనోపాధి ఎలా అని ఉపాధి కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నంద్యాల జిల్లా కలెక్టర్ నూతన ఉపాధి పనులను మంజూరు చేసి ఉపాధి కూలీలను ఆదుకోవాలని కోరుతున్నారు.

# జర్నలిస్ట్ రైల్వే పాసుల పునరుద్ధరణకు కృషి చేయాలి

## - ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు వినతి.

ఆంధ్ర ప్రగతి గుంటూరు జూన్ 21: కరోన సమయంలో రద్దయిన జర్నలిస్టు రైల్వే పాస్ ల రాయితీ పునరుద్ధరణకు కృషి చేయాలని ఏపీడబ్ల్యూజే ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మ రాజు చలపతిరావు విజ్ఞప్తి చేశారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యునిగా రెండవసారి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన లావు కృష్ణదేవరాయలను నిమ్మ రాజు చలపతిరావు, సీనియర్ జర్నలిస్ట్ ఏకే మోహన్ రావు లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు లో హైదరాబాద్ వెళ్లే ఎక్స్ప్రెస్ రైళ్లు నిలుపుదలకు కృషి చేయాలని ఆ ప్రాంత జర్నలిస్టులు కోరుతున్నారని విజ్ఞప్తి చేశారు. గత ఎనిమిదేళ్ల క్రితం ఒక ఎక్స్ప్రెస్ రైలుకు



పెదకూరపాడు లో స్టాపింగ్ ఇచ్చారు. అయితే టికెట్ ముద్రణ లేక పోవటంతో కౌంటర్లో చేతితో రాసి టిక్కెట్టు ఇచ్చేవారు. గుంటూరు నుండి సత్తెనపల్లికి, పెదకూరపాడుకు చార్జీ 9 రూపాయలు ఉండటంతో సత్తెనపల్లికి టికెట్ ఇస్తుండటంతో ప్రయాణికులు తగ్గుముఖం పట్టారనే నెపంతో అప్పట్లో స్టాపింగ్ ఎత్తివేసారని చలపతిరావు గుర్తు చేశారు. గడచిన మూడేళ్లలో పల్నాడు జిల్లాలోని మారుమూల గ్రామాలన్నింటికీ బిఎస్ఎన్ఎల్ సేవలను విస్తృత పరిచేందుకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఎంతగానో కృషి చేశారని అన్నారు. వెనుకబడ్డ పల్నాడు ప్రాంతానికి బిఎస్ఎన్ఎల్ సేవలను మరింత చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విరివిగా సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని చలపతిరావు కోరారు. ఇందుకు శ్రీ కృష్ణ దేవరాయలు సానుకూలంగా స్పందించారు.

## ప్రపంచానికి భారతదేశం అందించిన

# అపురూప సంపద యోగా

### -యోగాతోనే ఆరోగ్య భారతం.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21: ప్రపంచంలో అత్యంత విలువైనది ఆరోగ్యమని, అటువంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే యోగకు మించిన మార్గం మరొకటి లేదని, తిరుమల తిరుపతి దేవస్థానములు పూర్వ సంయుక్త కార్యనిర్వహణాధికారి, విశ్రాంత నల్లగొండ జిల్లా కలెక్టర్ నంది వెలుగు ముక్తేశ్వర రావు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండస్ పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేసిన సామూహిక యోగా కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు అనేక దృష్టాంతాలను వివరించి, గొప్ప లక్ష్యసాధకులు కావాలని ఉద్బోధించారు. విద్యార్థులు చేసిన అనేక యోగ భంగిమలు సంభ్రమాశ్చర్యాలను కలిగించాయి. విద్యార్థులలో సృజనాత్మకతను పెంచుటకు పాఠశాల చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత కె.వి.రాజశేఖర్ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో గాయినీ రాజశేఖర్, సిఇఒ విల్సన్ అగస్టన్, ప్రధానోపాధ్యాయిని మీనాక్షి విల్సన్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి, కో-ఆర్డినేటర్స్ రమణ, వేణుగోపాల్ రెడ్డి, యోగా మాస్టరు బి.శ్రీనివాసులు, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డితో పాటు పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## బాల అకాడమీ పాఠశాలలో ఘనంగా జరిగిన

# అంతర్జాతీయ యోగా దినోత్సవము.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21: నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో జూన్ 21వ తేదీన అనగా బుధవారము బాల అకాడమీ పాఠశాలలో 'అంతర్జాతీయ యోగా దినోత్సవము' ను ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాపాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత పాల్గొన్నారు. మాధవీలత మాట్లాడుతూ 2014 సెప్టెంబర్ 27వ తేదీన భారత ప్రధాని అయిన నరేంద్ర మోడీ ఐక్యరాజ్య సమితి సర్వ సభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకోవాలని ప్రతిపాదన చేశారు. "యోగా అంటే వ్యాయమ సాధనల సమాహారాల అధ్యాత్మిక రూపం". మోక్ష సాధనలో భాగమైన ధ్యానము అంతఃదృష్టి, వంటి ఆధ్యాత్మిక పరమైన సాధనలకు పునాది. యోగా వలన మనకు కలిగే అనేక ప్రయోజనాల గురించి పిల్లలు అవగాహన చేసుకొనేలా, వారికి అర్థము అయ్యేలా తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులలో ఏకాగ్రతను శారీరక వికాసాన్ని మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం కలిగించడానికి ఈ యోగాసనాలు విద్యార్థులకు ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత మరియు పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులందరూ మరియు విద్యార్థులు అందరూ గురూజీ మరియు ముఖ్య ప్రముఖుల ఆధ్వర్యములో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగినది.

# బోయలకుంట్లలో ఆలయ భూములు కౌలు వేలం పాటలు

### -రూ 2లక్షల,93, వేలు పెరిగిన ఆదాయం.

### -గ్రూపు దేవస్థానం ఈవో గంట వేణునాధ రెడ్డి.



ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల,జూన్21: మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలో వెలసిన శ్రీ రామేశ్వర, శ్రీ వీరభద్ర, శ్రీ అనంతపద్మనాభ వేణుగోపాల, ఆంజనేయ స్వామి మరియు శ్రీ నరసింహ స్వామి దేవస్థానం లకు చెందిన భూములను బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహించగా రూ 2లక్షల,93వేల, ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో గంట వేణునాధ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆలయ చైర్మన్ జింకల నారాయణ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించినట్లు తెలిపారు. గత సంవత్సరం రూ 11 లక్షల 14 వేలు వేలం పాటల ద్వారా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం 2024 -25 వ సంవత్సరానికి కౌలు కు ఇచ్చుటగాను ఈనెల 21వ తేదీన ఉదయం శ్రీ రామే శ్వర స్వామి దేవస్థానం నందు భూములను బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహించ గా రూ14 లక్షల 07వేల రూపాయ లు రావడం జరిగిందని అన్నా రు. గత సంవత్సరానికి ఈ సంవత్సరానికి 2లక్షల,93 వేల రూపాయలు ఆదాయం వచ్చి నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ఇన్స్పెక్టర్ హరిచంద్రారెడ్డి, శ్రీ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, గ్రామరైతులు, అలయఅధికారులు, సిబ్బంది ,పాటాదారులు, రైతులు ,తదితరులు పాల్గొన్నారు . ఎటువంటి ఘర్షణలకు తావివ్వకుండా ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# యోగ సాధన వల్ల ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుంది

- **నిత్యం పని ఒత్తిడితో ఉండే వారికి యోగా మంచి ఔషదంలా పనిచేస్తుంది.**
- **నేడు ప్రపంచంలో యోగా ఎంతో ఆదరణ పొందుతుంది.**
- **జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:** యోగ సాధన వల్ల ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని మరియు మానసిక ప్రశాంతత యోగా వల్లే సాధ్యమవుతుందని నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంతేకాక శాంతినికేతన్ విద్యమందిర్ లో మరియు క్రాంతినగర్ లోని హార్ట్ ఫుల్ నెస్ఇన్స్టిట్యూట్ నందు జరిగిన అంతర్జాతీయ యోగా కార్యక్రమం నందు జిల్లా ఎస్పీ పాల్గొని విద్యార్థిని విద్యార్తులకు యోగా చెయ్యడం వలన కలుగు ప్రయోజనాల గురించి వివరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కొన్ని వేల సంవత్సరాల క్రితం పతంజలి మహర్షి ఎంతో ముందుచూపుతో మన సమాజాన్ని,ఆరోగ్యాన్ని,వచ్చే తరాలు బాగుండాలనే ఉద్దేశంతో యోగా అనే చక్కటి ప్రక్రియను ఏర్పాటు చెయ్యడం జరిగిందని,మనకు వచ్చే అన్నీరకాల అనారోగ్యాలు మనకున్న , ఒడిదుడుకులతో,పని ఒత్తిడితో, ఎన్నెన్నో సంఘటనలతో రావచ్చు కావున ప్రతి ఒక్కరూ యోగాను తన దైనందిన జీవితంలో అలవాటు చేసుకోవాలని , ప్రతి ఒక్క విద్యార్థి విద్యతో పాటు యోగా చేస్తూ మానసిక ఉల్లాసాన్ని పొందీ ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని సూచించారు.ధ్యానం మనస్సుని శుద్ధిచేసే ఓ ప్రక్రియ అని,యోగా సాధన వల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి అవగాహన పెంచడం కోసమే ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలియజేశారు.

ధ్యానం,యోగా వల్ల ఎంతో ప్రశాంతత చేకూరుతుందని, సంపూర్ణముగా జీవించడం ఎలాగో ధ్యానం ద్వారానే అలవడుతుందన్నారు. పోలీసులు విధులలో రోజువారి జీవితాలు ఆరోగ్య మానసిక ఒత్తిడికి గురవుతుంటారని, యోగ సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుండి పూర్తిగా బయటపడవచ్చు అన్నారు. మనం బాగున్నాడమే కాకుండా మనం కూడా సమాజానికి మంచి చేయాలంటే యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.యోగ మన దేశ సంప్రదాయంలో ఒక భాగమని దీన్ని ప్రతి ఒక్కరూ పాటించి ఆరోగ్య జీవనం సాగించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నట్లు ఎస్పీ తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీకె.ప్రవీణ్ కుమార్, ఏ ఆర్ డి.ఎస్.పి శ్రీనివాసులు, నంద్యాల టౌన్ లోని ఇన్స్పెక్టర్లు మరియు ఎస్సై లు, ఏ ఆర్ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు వారి సిబ్బంది, నంద్యాల సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుష్ యోగ ఆధ్వర్యంలో

# ప్రపంచ యోగా దినోత్సవం

### -యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం.






ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఆయుష్ యోగ నిర్వాహకులు ఆనంద్ గురూజీ పేర్కొన్నారు. ఆయుష్ యోగ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని స్థానిక మున్సిపల్ పార్కులోని ఆయుష్ యోగా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎండి ఫిరోజ్, 12వ వార్డు కౌన్సిలర్ శ్యామ్ సుందర్ లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ గురూజీ మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక స్థితి కూడా బాగుంటుందన్నారు. నేటి ఆధునిక జీవితంలో మనిషి ప్రతిరోజు ఒక గంట పాటు యోగా చేయడం వల్ల తను ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. యోగాతో చిన్న చిన్న రుగ్మతలే కాకుండా క్యాన్సర్ లాంటి కఠినమైన రోగాలు కూడా నయమయ్యే అవకాశాలు యోగాలు అద్భుతంగా ఉన్నాయని ఆయన వివరించారు.టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయాన్నే యోగ అభ్యసనం చేయిస్తున్న ఆనంద్ గురూజీని అభినందిస్తూ యోగా చేయడం వల్ల తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా మానసిక ఒత్తిడిని తట్టుకోవచ్చని, యోగ వల్ల ఎటువంటి జబ్బులు రావని ప్రతి ఒక్కరు యోగ సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు యోగ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈ నెల 29వ తేదీన విజయవాడలో జరిగే పి.డిఎస్.యు

# రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయండి

### -పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21: శాస్త్రీయ విద్యాసాధన కై, ప్రభుత్వ విద్యా పరిరక్షణకై నిరంతరం ఉద్యమిస్తున్న పిడిఎస్. యు విద్యార్థి సంఘం ఈనెల 29న విజయవాడలో జరుగు పి.డి ఎస్.యు రాష్ట్ర స్థాయి జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని పి.డి ఎస్.యు జిల్లా అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నంద్యాల పట్టణంలో శుక్రవారం నాడు ఒక ప్రైవేట్ కళాశాల ఆవరణలో పి.డి ఎస్.యు శ్రేణులు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ నిర్వహణ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్.యు జిల్లా అధ్యక్షులు ఎస్. ఎండి .రఫీ మాట్లాడుతూ 1974లో ఏర్పడిన పిడిఎస్.యు స్వేచ్ఛ, సమానత్వం కోసం, శాస్త్రీయ విద్యాసాధన కొరకు నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తుందన్నారు. ఈ క్రమంలోనే జార్జి రెడ్డి ,జెసిఎస్ ప్రసాద్, కోలా శంకర్, శ్రీపాద శ్రీహరి ,చేరాలు తదితరులు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిర్మాణం కోసం రాజ్యంతో పోరాడి తమ ప్రాణాలను అర్పించారని అన్నారు. వారు అందించిన విప్లవస్ఫూర్తితో విద్యార్థుల హక్కులకై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ క్రమంలోనే సంస్థ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు పిడిఎస్ యు రాష్ట్రస్థాయి జనరల్ కౌన్సిల్ సమావేశాలు జూన్ 29న విజయవాడలో జరుపుకోవాలని పిడిఎస్ యు రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను హక్కుగా ,బాధ్యతగా ప్రజలకు అందరికీ అందిస్తామని చట్టం చేశారు తప్ప దాన్ని అమలుకు నోచుకోలేక ,ప్రైవేట్ విద్యాసంస్థలు ఆర్థికమే ధ్యేయంగా విద్యను అంగడి సరుకుగా మార్చేశారని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను దేశానికి పట్టుకొమ్మలుగా ఉన్నటువంటి వాటిని నేడు బ్రాహ్మణీయ భావజాలంగా విశ్వవిద్యాలయాలను అగ్ర హారాలుగా మారుస్తున్నారని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో బ్రాహ్మణీయ భావజాలాన్ని విద్యార్థుల మెదడులో చెప్పించేందుకు బిజెపి ప్రభుత్వం చాప కింద నీరులా తమ మనువాద భావజాలాన్ని పాఠ్యాంశాలలో ముద్రిస్తున్నారని అన్నారు. భవిష్యత్ తరాలకు వైద్యం అందించే నీట్ ఎంట్రన్స్ వంటి జాతీయ పరీక్షలకు పేపర్ లీకులు, ఫలితాల్లో గందరగోళం సృష్టిస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదా, విభజన హామీలు, కేంద్రీయ విద్యాసంస్థల ఏర్పాటు పైన, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకై పి డి ఎస్ యు ముందుండి పోరాడిందన్నారు. అలాగే సంక్షేమ హాస్టల్స్ ప్రభుత్వ పాఠశాలలు ఉన్నత సాంకేతిక విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై భవిష్యత్ కార్యక్రమం రూపొందించి, విద్యార్థులను చైతన్యపరిచి ఉద్యమించేందుకు సన్నద్ధం చేస్తోందన్నారు. పిడిఎస్ యు తన సంస్థ నిర్మాణాన్ని మరింత పటిష్టపరుచుకునేందుకు జూన్ 29న విజయవాడలో జరుగు రాష్ట్రస్థాయి జనరల్ కౌన్సిల్ ను విద్యార్థులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు తమ వంతు సహాయ ,సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నంద్యాల డివిజన్ అధ్యక్షులు షాహిద్,కార్యదర్శి బాలాజీ,నాయకులు నాగరాజు, బాష,కళ్యాణ్,నాయం వుతంల్లా, వీరేంద్ర,పవన్,హరి,విజయ్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.